ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -117 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 15 మే 2026




# ప్రతి శుక్రవారం నో వెహికల్ డే

- కాన్వాయ్ సైజు తగ్గించుకుందాం
- అత్యవసరమైతేనే విదేశీ పర్యటనలు
- ఏసీలు 24-26 డిగ్రీలను దాటొద్దు
- కొత్త వాహనాలు కొంటే.. ఈవీలే కొనాలి
- అవసరమైతే సైకిళ్లపై సచివాలయానికి
- జిల్లాల పర్యటనల్లోనూ పొదుపు దృష్టి
- ప్రతి అంశంలోనూ ప్రజలకు ఆదర్శం
- పొదుపు చర్యలపై క్యాబినెట్ సబ్ కమిటీ
- శాఖలవారీగా కార్యదర్శులు నివేదికలివ్వాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశం

**అమరావతి, మే 14 ఆంధ్ర ప్రగతి**
పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో 'నా దేశం.. నా బాధ్యత' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టింది. గురువారం జరిగిన క్యాబినెట్ భేటీలోను, అజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత మంత్రులు, అధికారులతో జరిపిన సమావేశంలోను ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన పొదుపు చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..**మిగతా 2లో...**

# రాయలసీమ ఇకపై 'రక్షణ సీమ'

- ఏఎంసీఏ ప్రాజెక్టుతో ఏపీలో నవ శకం
- రాయలసీమను డి హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వ భారీ అడుగులు
- పుట్టపర్తిలో రూ.15,803 కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు
- డ్రోన్, డిఫెన్స్ రంగాల్లో మరో 12 కంపెనీల ప్రాజెక్టులకు శ్రీకారం
- వేల కోట్ల పెట్టుబడులతో పాటు వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు


2లో.

# చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?

- ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై జగన్ స్పందన
- ఫీడ్ కంపెనీలతో కూటమి ప్రభుత్వం కుమ్మక్కైందంటూ తీవ్ర విమర్శలు
- ధరలు తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్
- లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరిక


2లో.

# ఆర్డీటీ మనందరి సంస్థ..

## రాజకీయాలకు అతీతంగా అండగా నిలుద్దాం: మంత్రి నారా లోకేష్

## ఆర్డీటీ సంస్థకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి నారా లోకేష్ భరోసా

**శ్రీ సత్యసాయి మే 14 ఆంధ్ర ప్రగతి**
"ఆర్డీటీ సంస్థకు నా వంతు సహాయం చేయగలగడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇది మనందరి సంస్థ. ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఆర్డీటీకి మద్దతుగా నిలవాలి. ఈ సంస్థ సేవలు ఆంధ్రప్రదేశ్ మొత్తం విస్తరించాలి, అందుకు మా ప్రభుత్వం అండగా నిలబడుతుంది," అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆసుపత్రిని సందర్శించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, "నా యువగళం పాదయాత్రకు ముందు ఆర్డీటీ గురించి విన్నాను. కానీ పాదయాత్రలో వారు చేస్తున్న అద్భుతమైన**మిగతా 2లో...**



# చిన్న పరిశ్రమలకు భారీ ఊతం

- ఏపీ ఎస్ఎంఈఎక్స్ ఏర్పాటుకు క్యాబినెట్ నిర్ణయం
- లక్ష కోట్లతో రిలయన్స్ ఏఐ డేటా సెంటర్
- మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి



**అమరావతి, మే 14 ఆంధ్ర ప్రగతి**
: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లకు ఈక్విటీ, ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్**మిగతా 2లో...**

# యూపీలో గాలివాన.. 117 మందిమృతి

## 72 మందికి గాయాలు



**లఖ్‌నవూ, మే 14 ఆంధ్ర ప్రగతి**
ఉత్తరప్రదేశ్‌లో అకాల వర్షాలు పెను విషాదాన్ని నింపాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షాలు, పిడుగుపాట్లతో తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లింది. వివిధ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో 117 మంది మృతి చెందగా, 72 మంది గాయపడ్డారు. 170 పశువులు మృత్యువాత పడ్డాయి. 227 ఇళ్లు దెబ్బతిన్నాయి. అత్యధికంగా ప్రయాగ్‌రాజ్ జిల్లాలో 24 మంది మృతి చెందగా, భదోహీలో 18 మంది, మీర్జాపూర్‌లో 15 మంది, ఫతేపూర్‌లో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉన్నావ్, బదాయూన్, ప్రతాపీపగఢ్, బరేలీ, సీతాపూర్, రాయ్‌బరేలీ, చందౌలీ జిల్లాల్లో కూడా భారీగా ప్రాణనష్టం జరిగింది. మృతుల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం రూ.4 లక్షల పరిహారం ప్రకటించింది. రాష్ట్రంలో బుధవారం సాయంత్రం **మిగతా 2లో...**


2లో.

# స్థానిక ఎన్నికలపై జనసేన కసరత్తు

## విస్తృతస్థాయిలో పార్టీ నేతల సమీక్షలు -నేడు సాధక్‌లతో పవన్ కళ్యాణ్ భేటీ



# బండి భగీరథ్‌కు మధ్యంతర బెయిలుపై నేడు నిర్ణయం

- బాధితురాలి రెండు బర్త్ సర్టిఫికెట్లలో ఏది నిజం?
- వాదనలన్నీ విన్నాకే ముందస్తు బెయిల్‌పై నిర్ణయం
- విచారణ వచ్చే వారానికి వాయిదా వేసిన హైకోర్టు
- భగీరథ్ కోసం కొనసాగుతున్న పోలీసు గాలింపు

**హైదరాబాద్ మే 14 ఆంధ్ర ప్రగతి**
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్(ఐఏ)పై శుక్రవారం ఉత్తర్వులు వెలువరిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే, బాధితురాలికి సంబంధించిన రెండు బర్త్ సర్టిఫికెట్లలో ఏది వాస్తవమో తేల్చాలని సూచించింది**మిగతా 2లో...**

# ప్రతి శుక్రవారం నో వెహికల్ డే

మొదటిపేజీ తరువాయి

దేశం మనకు ఎంతో ఇచ్చిందని, ఇప్పుడు దేశానికి మనం తిరిగి ఇచ్చే సమయం ఆసన్నమైందని అన్నారు. దేశాన్ని కాపాడుకునేందుకు పొదుపు చర్యలు పాటిద్దామని పిలుపునిచ్చారు. అందులో భాగంగా కేంద్రం అమలుచేస్తున్న అన్ని పొదుపు చర్యలను మనమూ పాటిద్దామని స్పష్టం చేశారు. వాటితోపాటు తనతోసహా మంత్రులు, అధికారులు తమ వాహన శ్రేణులను కుదించుకుని ఇంధన ఆదాపై దృష్టి పెట్టాలని కోరారు. మంత్రులు, అధికారులు తమ చాంబర్లలో ఏసీలను 24-26 డిగ్రీల్లో పెట్టుకోవాలని, దానివల్ల ఎంతో విద్యుత్తు ఆదా అవుతుందన్నారు. మంత్రులు, అధికారులు వాడే వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకునే అవకాశాలను పరిశీలించాలని కోరారు. బంగారం కొనుగోళ్లను తగ్గించుకుని ప్రజలకు ఆదర్శంగా నిలుద్దామన్నారు. అలాగే మంత్రులు, అధికారులు వ్యక్తిగత, అధికారిక విదేశీ పర్యటనలు పూర్తిగా తగ్గించుకోవాలని, అత్యవసరమయితే తప్ప వెళ్లొద్దని సూచించారు. శాఖలవారీగా సమావేశాలను ఆన్‌లైన్‌లో నిర్వహించుకోవాలని కోరారు. ఆయా శాఖల్లో ఎలాంటి పొదుపు చర్యలు పాటించవచ్చో అధ్యయనం చేసి కార్యదర్శులందరూ నివేదికలు ఇవ్వాలన్నారు. పొదుపు చర్యలపై క్యాబినెట్ సబ్ కమిటీని కూడా నియమిద్దామన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

**మనమే ముందుందాం..**

"పొదుపు చర్యల్లో భాగంగా వారంలో ఒకరోజు (శుక్రవారం) 'నో వెహికిల్ డే'గా పాటిద్దాం. సమావేశాలను ఆన్‌లైన్‌లో వర్చువల్‌గా నిర్వహిద్దాం. ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా సాధ్యమైనంత వరకు ప్రభుత్వ రవాణా వ్యవస్థ(ఆర్టీసీ బస్సులు)ను ఉపయోగిస్తే బాగుంటుంది. అవకాశం ఉంటే వాహనాలను పక్కనపెట్టి సైకిలింగ్, పాదయాత్రల ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలవాలి. అందరం సచివాలయానికి సైకిళ్లపై వద్దాం. వారానికో రోజు మంత్రులు, అధికారులు సైకిళ్లపై సచివాలయానికి వస్తే కచ్చితంగా అది ప్రజలపై ప్రభావం చూపి.. వారు సైతం అదే బాట పడతారు. విశ్వవిద్యాలయాల్లో ఆన్‌లైన్ క్లాసులు చెప్పడానికి అవకాశం ఉంటుందేమో పరిశీలించాలి. వర్సిటీలు, విద్యా సంస్థల్లో వారానికి 2 రోజులు విద్యార్థులు 'నో బైక్ డే ' పాటించాలి. ప్రభుత్వ శాఖల్లో వారానికి రెండ్రోజులు ఇంటి నుంచే పని (వర్క్ ఫ్రం హోం) చేసే విధానం రూపొందించవచ్చేమో చూడాలి. ఇంధనం విషయంలో తొలుత దేశం గురించి ఆలోచించాలి. పొదుపు చర్యలతో ఆదాయం తగ్గినా భరించేందుకు సిద్ధం. వాకింగ్, సైక్లింగ్ తదితర పర్యావరణ హితమైన చర్యలు పాటించాలి. రైతులు కూడా రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి. నానో ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన పెంచుకోవాలి."

**ఈవీ స్టేషన్లను పెంచుదాం..**

"రాష్ట్రంలో ఈవీ స్టేషన్ల పెంపులో భాగంగా ఆయా సంస్థలకు ప్రోత్సాహకాలు అందిద్దాం. ట్రాఫిక్‌లో ఎక్కువ సేపు వాహనాలు నిలవకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి. ఆర్టీసీ తీసుకుంటున్న పొదుపు చర్యలపై సమీక్షిస్తాం. స్వదేశీ పర్యాటకం, స్వదేశీ ఉత్పత్తులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. మన దేశంలోనే అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. విదేశీ ప్రయాణాలు తగ్గించుకుని వేసవి, ఇతర సెలవు రోజుల్లో ఆయా ప్రాంతాలను సందర్శించాలి. విదేశీ వస్తువుల కొనుగోళ్లను తగ్గించి స్వదేశీ తయారీ ఉత్పత్తులను ఎక్కువగా వాడాలి. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాలను సీరియస్‌గా తీసుకోవాలి. ఎప్పటినుంచో చెబుతున్నా, నా మాటలను చాలా మంది మంత్రులు సీరియస్‌గా తీసుకోలేదు. పదేళ్ల క్రితమే పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) ఆవశ్యకతను ప్రస్తావించాను. మంత్రులు, అధికారులు శ్రద్ధ పెట్టకపోవడంతో అమలులో తీవ్రజాప్యం చోటుచేసుకుంది"

"కేంద్రం డీలిమిటేషన్ విషయంలో చాలా పట్టుదలతో ఉంది. 2029 ఎన్నికల నాటికి ఈ ప్రక్రియ తప్పకుండా జరిగే అవకాశం ఉంది. దానికి తగ్గట్టుగా మనం ఇప్పటి నుంచే సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. గత ఏడాది ఎలాంటి సంక్షోభ పరిస్థితులు లేకున్నా, యూరియా లభ్యత బాగున్నా, నిర్వహణ లోపంతో చాలా ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈసారి యూరియా విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది".

**ఒక్కసారిగా ప్రకటనలొద్దు: పవన్**

పొదుపు చర్యలపై ప్రభుత్వం ఒక్కసారిగా ప్రకటనలు, ప్రచారం మొదలుపెడితే ప్రజలు భయపడిపోయే అవకాశం ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముందుగా పరిస్థితిని వివరించి, వారికి అవగాహన కల్పించాక ముందుకు వెళితే బాగుంటుందని సూచించారు. సీఎం స్పందిస్తూ, 2-3 రోజులు పూర్తిస్థాయి అవగాహన కల్పించి, ఆ తర్వాత కార్యాచరణ ప్రకటిద్దామని అన్నారు.

క్యాబినెట్ సమావేశం ప్రారంభమయ్యే సమయానికి ఒకరిద్దరు మినహా కార్యదర్శులు హాజరుకాకపోవడంపై సీఎం సీరియస్ అయ్యారు. అందరికీ సమాచారం ఇచ్చారా అని అక్కడే ఉన్న ప్రత్యేక సీఎస్ విజయానంద్‌ను ప్రశ్నించారు. బుధవారం రాత్రే అందరికీ సమాచారం పంపామని ఆయన తెలిపారు. దీంతో సీరియస్ అయిన సీఎం.. సమావేశానికి రాని వారి పేర్లు, ఆలస్యంగా వచ్చిన వారి పేర్లు నోట్ చేసుకుని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**అగ్రిగోల్డ్ బాధితులకు 6 నెలల్లో న్యాయం: సీఎం**

అగ్రిగోల్డ్ బాధితులకు ఆరు నెలల్లో న్యాయం చేయాలని సీఎం ఆదేశించారు. ముగ్గురు మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ నియమించాలని నిర్ణయించారు. ఎనిమిది రాష్ట్రాల్లో సుమారు 19.18 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉండగా, ఒక్క ఏపీలోనే సుమారు 11.57 లక్షల మంది ఉన్నారని హోం మంత్రి అనిత తెలిపారు. వారిలో ప్రతి ఒక్క బాధితుడికీ న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని సీఎం అన్నారు. గత ప్రభుత్వంలో కొందరు అధికారులు సైతం అగ్రి గోల్డ్ బాధితులకు చెందాల్సిన ఆస్తులను స్వాహా చేశారని, ఇది బాధాకరమన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్దేశిత సమయంలోగా అగ్రి బాధితులకు న్యాయం చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

# బండి భగీరథ్‌కు మధ్యంతర బెయిలుపై నేడు నిర్ణయం

. మొదటిపేజీ తరువాయి

ప్రధాన పిటిషన్ అయిన ముందస్తు బెయిల్‌పై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. తనపై పేట్‌బషీరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని, ఒకవేళ అరెస్టు చేసినా వెంటనే బెయిల్‌పై విడుదల చేసేలా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టీ మాధవీదేవి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అయితే, ఈ కేసులో సత్వర విచారణపై బాధితురాలి తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేయగా.. బాధితురాలి తరఫు వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వమని న్యాయస్థానం తేల్చిచెప్పింది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదుల తీరుపై ధర్మాసనం కొంత అసహనం వ్యక్తం చేసింది. భగీరథ్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. విచారణకు హాజరుకావడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి భగీరథ్ సిద్ధంగా ఉన్నారని, తాము కేసును కొట్టేయమని కోరడం లేదని, అరెస్టు నుంచి రక్షణ మాత్రమే కోరుతున్నామని తెలిపారు. సుప్రీం కోర్టు గత తీర్పుల ప్రకారం ఈ కేసులో భగీరథ్ బెయిల్‌కు అర్హుడని, ప్రస్తుతానికి మధ్యంతర ఉపశమన ఉత్తర్వులివ్వాలని కోరారు. ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. 'బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ముందుగా కేసు నమోదు చేశారు. బాధితురాలి వాంగ్మూలం రికార్డు చేసిన తర్వాత సెక్షన్లు మార్పు చేశారు' అని చెప్పారు. బాధితురాలి తరఫున న్యాయవాది పప్పు నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. నిందితుడు పరారీలో ఉంటూ ముందస్తు బెయిల్ కోరడం విడ్డూరంగా ఉందని, అంతేకాక అంత అత్యవసరం బెయిల్ కోరడం సరికాదన్నారు. మధ్యంతర ఉపశమన ఉత్తర్వులిస్తే ముందస్తు బెయిల్ ఇచ్చినట్లేనని తెలిపారు. నిందితుడికి బెయిల్ వస్తే బాధితురాలు, ఆమె కుటుంబాన్ని వేధింపులకు గురి చేసే అవకాశం ఉందన్నారు. బాధితురాలి స్టేట్‌మెంట్‌ను కోర్టుకు సమర్పించేలా ఆదేశాలివ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ముందస్తు బెయిల్ మధ్యంతర అప్లికేషన్‌పై వాదనలు విని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. ప్రధాన పిటిషన్‌లో విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. కాగా, మధ్యంతర రక్షణపై తీర్పును న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది. దీంతో ఇప్పటికే పోలీసులు ఇచ్చిన నోటీసులకు విచారణకు తప్పక హాజరుకావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో బండి భగీరథ్ శుక్రవారం పోలీసు విచారణకు వస్తాడా? లేదా కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగుతాడా ? అనేది చూడాలి.

# యూపీలో గాలివాన..117 మందిమృతి

మొదటిపేజీ తరువాయి

వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, భారీ క్యుములోనింబస్ మేఘాలు అనేక ప్రాంతాలను కమ్మేశాయి. ఈదురుగాలులతో కూడిన వర్షాలతో భారీ హోర్డింగులు, రేకుల షెడ్లు ఎగిరిపోగా, చెట్లు నేలకొరిగాయి. రోడ్లపై చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని వాహనాలు చెట్ల కింద నలిగిపోయాయి. అనేక ఇళ్లు ధ్వంసమవగా, శిథిలాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయి. భదోహి జిల్లాలో ఓ వంతెన కూలి అనేక మంది గంగానదిలో పడిపోయారు. మీర్జాపూర్‌లో మరో వంతెన దెబ్బతిని దాదాపు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రతాప్‌గఢ్, కాన్పూర్ జిల్లాలో పిడుగుపాట్లకు గురై నలుగురు ప్రాణాలు కోల్పోయారు. బరేలీ జిల్లాలోని బమియానా గ్రామంలో భారీ గాలులకు నన్హే మియా అనే ఆటో డ్రైవర్ రేకుల షెడ్డుతో పాటు సుమారు 50 అడుగుల ఎత్తుకు ఎగిరి పక్కన ఉన్న పొలాల్లో పడిపోయాడు. కొట్టుకుపోతున్న రేకుల షెడ్డును ఆపబోయి అతడు ఈ ప్రమాదానికి గురయ్యాడు. ఈదురుగాలుల తీవ్రత ఎంత ప్రమాదకరంగా ఉందో తెలిపే ఈ వీడియో సోషల్ మీడియా లో వైరల్ అయ్యింది. ఈ ఘటనలో చేతులు, కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడిన నన్హే మియా ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలపై అధికారు లు వెంటనే స్పందించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. సహాయక చర్యలు వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, డివిజనల్ కమిషనర్లకు సూచించారు. ప్రతి మూడు గంటలకు ఒకసారి తనకు నివేదికలు పంపాలని ఆదేశించారు.

# చిన్న పరిశ్రమలకు భారీ ఊతం

మొదటిపేజీ తరువాయి

ఎస్ఎంఈ ఎక్స్ఛేంజ్ (ఏపీఎస్ఎంఈఎక్స్) ప్రారంభానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇందుకోసం రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు కూడా నిర్ణయించింది. ఇది ఏపీఎస్ఎంఈఎక్స్ రూపకల్పనకు సంబంధిత వర్గాలతో సంప్రదింపులు, రెగ్యులేటరీ సంస్థలతో సమన్వయంతో సమగ్ర ప్రతిపాదనలను రూపొందించి సమర్పిస్తుంది. విశాఖపట్నం జిల్లాలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌తో అనుసంధానంగా గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి రిలయెన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు 854.97 ఎకరాల భూమి కేటాయించి.. ప్రోత్సాహకాలను విస్తరించాలని క్యాబినెట్ నిర్ణయించింది. విశాఖ జిల్లాలోని పోలిపల్లి, భోగాపురం ఈస్ట్, భోగాపురం వెస్ట్ గ్రామాల్లో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతారు. భూమిని 25 శాతం రాయితీతో కేటాయిస్తారు. రూ.1,08,010 కోట్ల భారీ పెట్టుబడితో వచ్చే ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 1000 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అలాగే క్యారియర్ ఎయిర్‌కండిషనింగ్ అండ్ రెఫ్రిజిరేషన్ లిమిటెడ్ సంస్థ తిరుపతి జిల్లా శ్రీసిటీలో అడ్వాన్స్‌డ్ ఎయిర్ కండిషనింగ్, రిఫ్రిజరేషన్ ఉత్పత్తుల తయారీ యూనిట్ నెలకొల్పడానికి కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. గురువారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశమైంది. రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) సిఫారసుల ఆమోదం సహా క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వివరించారు.

# భ్రూణ హత్యల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలి.

## ..పి.సి అండ్ పి.ఎన్.డి.టి చట్టాల పై అవగాహణ అవసరం.

## ..సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫీ.

**ఆంధ్ర ప్రగతి డోన్ మే 14:**

ఇటీవలి కాలంలో మన దేశంలో గణాంకాలు పరిశీలిస్తే ఆడపిల్లల నిష్పత్తి తగ్గుతున్నది. కాలానుగుణంగా వస్తున్న మార్పులు వల్ల దంపతులు మగపిల్లాడు పుడితే బాగుంటుందని భావించడం వల్ల ఆడపిల్లల భ్రూణ హత్యలు జరుగుతున్నా కారణంగా ఇలాంటి హత్యలను నిలువరించేందుకు ప్రభుత్వం 1994లో పిసి పీఎన్‌డీటీ (గర్భస్థ పిండ పరీక్ష నివారణ) చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం పై పూర్తిస్థాయిలో అవగాహన తో అక్రమ లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై సమాచారం అందించడానికి సమాజంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా ఈ చట్ట అమలుకు సహకరించాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. సమాజంలో చదువుకున్నవారు ,అధికారులు, మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామీణ , మండల, పట్టణ ప్రాంతాల ప్రజలకు భ్రూణ హత్యలను నివారించడానికి అవగాహన పెంచాలి. గ్రామ, మండలాల్లో నిర్వహించె సమావేశాలలో భ్రూణ హత్యల వల్ల జరిగే ప్రమాదాల పై చర్చ జరగాలి. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆలోచనా



పి. మహమ్మద్ రఫీ,సామాజిక కార్యకర్త, డోన్.

విధానం మార్పు రావాలి. పురుష మహిళ లింగ వివక్షత లేని సమాజం ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. మగవారికి ఏమాత్రమూ తీసిపోని విధంగా ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణిస్తున్నప్పటికీ వారి పట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతూనే ఉంది. మహిళ గర్భం దాల్చిన తర్వాత పుట్టబోయేది ఆడ, మగ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదీ చట్టరీత్యా నేరం. ఇలా తెలుసుకున్నవారితో పాటు తెలిపినవారు శిక్షార్హులు. కానీ కొన్ని చోట్ల ఈ నిబంధనలు తుంగలో తొక్కి లింగ నిర్ధారణ చేసి ఆడబిడ్డల హత్యలకు కారణమవుతున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు , భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరం అని తెలిసినా సరే భ్రూణ హత్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న విషయం బాలికల నిష్పత్తి తగ్గటమే నిదర్శమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

ప్రస్తుత సమాజంలో బాలికల సంఖ్య తగ్గుతున్నది. మహిళా నిష్పత్తి తగ్గటం వల్ల ప్రమాదకర భవిష్యత్‌ను సూచిస్తుందని లింగపరంగా అసమతుల్య స్థితి ఉంటే సమాజంలో అనేక ఇబ్బందులు పెరిగే ప్రమాదం ఉందని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. కావున లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలు సమాజంలో మంచి మార్పు కోసం పారదర్శకంగా, బాధ్యతతో పనిచేయాలి. ఆడ మగ ఇద్దరూ సమానమేనని, లింగ వివక్ష చూపడం నేరమేనని అన్నారు. ఆడబిడ్డలను పుట్ట నిద్దాం, పెరగనిద్దాం, చదవనిద్దాం. కడుపులో ఉన్నది ఆడ శిశువు అని తెలియగానే అబార్షన్ మొదలైన పద్ధతుల ద్వారా ఆ పిండాన్ని తొలగించడం స్త్రీల పట్ల వివక్షను చూపుతుందని, స్త్రీల ఆత్మగౌరవానికి వ్యతిరేకమని ఈ చట్టం భావిస్తుంది. ఈ విషయంలో దంపతుల ఆలోచనల్లో పూర్తిగా మార్పులు రావాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

# ఆర్డీటీ మనందరి సంస్థ..



మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాలను కళ్లారా చూశాను. ఇంట్లో వికలాంగులుగా పుట్టిన పిల్లలను కొందరు తల్లిదండ్రులు బాధతో వదిలేస్తే, అలాంటి పిల్లలను సొంత బిడ్డల కన్నా గొప్పగా చూసుకుంటున్న ఆర్డీటీ పాఠశాలను చూసి చలించిపోయాను. అనంతపురం పాదయాత్రలో మొదటిసారి మాంచో ఫెర్రర్ గారిని కలిశాను. ఆర్డీటీ కేవలం ఒక సంస్థ కాదు, అదొక ఉద్యమం. 57 ఏళ్లుగా పాఠశాలలు, ఆసుపత్రులు, క్రీడలు, పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి ఎన్నో సేవలు అందిస్తున్న తీరు నన్ను కదిలించింది. పాదయాత్ర ఇతర జిల్లాలకు వెళ్లినా, నా ప్రసంగాల్లో ఆర్డీటీ గురించి పదేపదే ప్రస్తావించాను," అని గుర్తు చేసుకున్నారు.

"సమాజానికి మంచి చేస్తున్న ఏ సంస్థకైనా ప్రభుత్వం అండగా నిలబడాల్సిన బాధ్యత ఉంది. గతంలో ఆర్డీటీ కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు, నేను వ్యక్తిగతంగా మాంచో గారితో మాట్లాడి, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి కొన్ని అపోహలను తొలగించి, ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ వచ్చేలా చూశాం. వెనుకబడిన జిల్లాను దత్తత తీసుకుని, ఇక్కడి ప్రజలను ప్రేమతో చూస్తున్న ఈ వ్యవస్థకు అండగా నిలబడటం మన బాధ్యత. మున్ముందు కూడా అండగా ఉంటాం. మాంచో గారు తెలుగులో మాట్లాడుతుంటే నేను ఆశ్చర్యపోయాను. తాను పుట్టి పెరిగింది ఇక్కడేనని, 13 ఏళ్ల వరకు తనకు ఇంగ్లీష్ రాదని ఆయన చెప్పడం వారికున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది," అని లోకేష్ వివరించారు.

# చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?

## ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై జగన్ స్పందన

**విజయవాడ, మే 14 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఫీడ్ కంపెనీలతో ప్రభుత్వం కుమ్మక్కై, కమీషన్ల కోసం ఆక్వా రైతులను దారుణంగా దోచుకుంటోందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పెంచిన ధరలను తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని జగన్ హెచ్చరించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు ఆక్వా రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని జగన్ విమర్శించారు. "మీ పరిపాలనలో దోపిడీకి ఏ రంగమూ మినహాయింపు కాదు. చివరకు ఆక్వా ఫీడ్ ధరల విషయంలో కంపెనీలతో కుమ్మక్కై ఆక్వా రైతులను కూడా దోచుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. ఫీడ్ కంపెనీల యాజమాన్యాలు టీడీపీ సానుభూతిపరులని, కమీషన్ల కోసం వారితో చంద్రబాబు లాలూచీ పడ్డారని, అందుకే వారు అడ్డగోలుగా ధరలు పెంచుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులను సిండికేట్ల నుంచి, దళారుల బారి నుంచి కాపాడేందుకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి, ముఖ్యమంత్రి చైర్మన్‌గా 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ' (ఏపీఎస్ఏడీఏ)ని ఏర్పాటు చేశామని జగన్ గుర్తుచేశారు. ఈ సంస్థ ద్వారా సీడ్, ఫీడ్ నాణ్యత, ధరలను నియంత్రించడంతో పాటు, ఆక్వా ఉత్పత్తులకు ప్రభుత్వమే ధర నిర్ణయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దీనికితోడు, ఆక్వా రైతులకు యూనిట్ కరెంటును కేవలం రూ.1.50కే అందించి అండగా నిలిచామని పేర్కొన్నారు

# రాయలసీమ ఇకపై'రక్షణ సీమ'

## పుట్టపర్తిలో రూ.15,803 కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు

**శ్రీ సత్యసాయి మే 14 ఆంధ్ర ప్రగతి**

ఒకప్పుడు రత్నాలకు, ఆ తర్వాత ఉద్యాన పంటలకు నెలవైన రాయలసీమ, ఇప్పుడు దేశ రక్షణ రంగంలో కీలక భూమిక పోషించేందుకు సిద్ధమవుతోంది. స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి కేంద్రంగా నిలవనుంది. 'రతనాల సీమ'గా చరిత్రలో, 'ఉద్యాన సీమ'గా వర్తమానంలో నిలిచిన ఈ ప్రాంతం, భవిష్యత్తులో 'రక్షణ సీమ'గా సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో రక్షణ, డ్రోన్ రంగాల్లో వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు రాయలసీమ వేదిక కానుంది. ఇందులో భాగంగా, శుక్రవారం శ్రీ సత్యసాయి



జిల్లా పుట్టపర్తిలో దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఏఎంసీఏ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది

**పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు భూమిపూజ**

దేశ రక్షణ వ్యవస్థలో గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టుకు పుట్టపర్తిలో పునాది రాయి పడనుంది. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ), డీఆర్‌డీఓ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. సుమారు రూ.15,803 కోట్ల భారీ బడ్జెట్‌తో, 650 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఈ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా, భారతదేశపు మొట్టమొదటి 5వ తరం స్టెల్త్ మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను అభివృద్ధి చేస్తారు. స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్, సూపర్ క్రూయిజ్ వంటి అత్యాధునిక సామర్థ్యాలు ఈ యుద్ధ విమానాల ప్రత్యేకత. కేవలం తయారీనే కాకుండా, వాటి టెస్టింగ్ కూడా పుట్టపర్తిలోనే చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 7,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. దీనికి అనుబంధంగా వచ్చే ఇతర పరిశ్రమల ద్వారా మరో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉందని, దీనికోసం ప్రభుత్వం మరో 400 ఎకరాలు కేటాయించింది.

# స్థానిక ఎన్నికలపై జనసేన కసరత్తు

**విజయవాడ, మే 14 ఆంధ్ర ప్రగతి** ఆంధప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు రాజకీయంగా కీలకంగా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరగబోయే ఈ ఎన్నికల్లో కూటమి పార్టీల బలం మరోసారి చాటనుంది. ప్రత్యేకంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రాజకీయ ఆధిపత్యం కోసం ప్రధాన పార్టీలు ఇప్పటికే వ్యూహరచన ప్రారంభించాయి. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన పార్టీ వార్డుల పునర్విభజన, రాజకీయ పరిస్థితులపై విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తోంది. నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లాల వారీ నివేదికలు సమర్పించడం, కూటమి వ్యూహాలపై చర్చించడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పనిచేసిన సాధక్‌లతో పవన్ కల్యాణ్ సమావేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన పార్టీ దృష్టి సారించింది. పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వార్డులు, డివిజన్ల పునర్విభజన అంశంపై కీలక సమావేశం నిర్వహించింది. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ భేటీకి పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రానున్న మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రాజకీయ పరిస్థితులు, వార్డుల పునర్విభజన, కూటమి వ్యూహాలపై సమగ్ర చర్చ జరిగింది.

# ఈ నెల 24,25 తేదీలలో బీజేపీ జిల్లా స్థాయి ప్రశిక్షణ తరగతులు.

**--జిల్లా ప్రశిక్షణ శిబిర ఏర్పాట్ల ను పరిశీలించిన అభిరుచి మధు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 14:** ఈనెల 24, 25 తేదీల్లో నంద్యాల పట్టణం లో నిర్వహించనున్న జిల్లా స్థాయి ప్రశిక్షణ కార్యక్రమ ఏర్పాట్లను జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు, జిల్లా ఉపాధ్యక్షుడు మరియు ప్రశిక్షణ కమిటీ కో-కన్వీనర్ నిమ్మకాయల సుధాకర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.శిక్షణ తరగతులు జరిగే హాలు, ప్రతినిధులకు కల్పించాల్సిన భోజన సౌకర్యాలు మరియు రాత్రి బస చేసే గదులను వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ...సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస ఏర్పాట్లు ఉండాలని నిర్వాహకులకు సూచించారు.శిక్షణ తరగతులు సజావుగా సాగేందుకు వీలుగా హాలులో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలన్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ మేధోమథన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు, ప్రశిక్షణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డోన్ జాతీయ రహదారిపై భారీ వాహనాల తనిఖీలు.

**దొంగ పత్రాలతో తిరుగుతున్న క్రేన్ సీజ్.**

**- నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై రూ. లక్ష జరిమానాలు.**

**ఆంధ్ర ప్రగతి డోన్ మే 14:**
డోన్ పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై పోలీసులు భారీ వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన ఈ తనిఖీలలో పట్టణ సీఐ ఇంతియాజ్ భాషా, రూరల్ సీఐ రాకేష్, ఎంవీఐ క్రాంతికుమార్‌తో పాటు పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు. జేసీబీలు, క్రేన్లు మరియు ఇతర భారీ వాహనాల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సమయంలో దొంగ పత్రాలతో రహదారిపై సంచరిస్తున్న ఒక క్రేన్‌ను అధికారులు గుర్తించారు. వాహనానికి సంబంధించిన పత్రాల్లో అక్రమాలు ఉన్నట్లు తేలడంతో వెంటనే ఆ క్రేన్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై మరింత విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్, పర్మిట్‌లు మరియు డ్రైవింగ్ లైసెన్స్‌లు వంటి తప్పనిసరి ధ్రువపత్రాలు లేని పలువురు వాహనదారులపై కేసులు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు కలిపి సుమారు రూ.1 లక్ష వరకు జరిమానాలు విధించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, రహదారులపై ప్రమాదాలను తగ్గించేందుకు మరియు అక్రమ రవాణాను అరికట్టేందుకు ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలు వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.
నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేసే అవకాశముందని హెచ్చరించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు కోరారు.



# ఎస్సీ/ఎస్టీ లబ్ధిదారుల గృహాల మీద సోలార్ ఇన్‌స్టాలేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలి.

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 14:** పీఎం సూర్య ఘర్ పథకం కింద ఎస్సీ/ఎస్టీ లబ్ధిదారుల గృహాల మీద సోలార్ ఇన్‌స్టాలేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విద్యుత్ శాఖ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.గురువారం పిఎం కుసుమ్, పిఎం సూర్య ఘర్ పథకాల అమలుపై విద్యుత్ శాఖాధికారులతో, కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఎం కుసుమ్ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.. పీఎం సూర్య ఘర్ పథకం కింద రిజిస్టర్ చేసుకున్న వారికి సోలార్ ఇన్‌స్టాల్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే వెండర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సూచించారు. పిఎం సూర్య ఘర్ క్యాపెక్స్ మోడల్‌లో వినియోగదారులు నేరుగా పెట్టుబడి పెట్టే విధానంపై కూడా పురోగతి సాధించాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్, విద్యుత్ శాఖ ఈఈలు,సోలార్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సత్తా చాటిన మోత్కులపల్లె విద్యార్థి..!

**..స్టేట్ 2 వ ర్యాంకర్ ను అభినందించిన స్టేట్ డైరెక్టర్.**

**..మాజీ సర్పంచ్ వెంకట వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం.**




**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల మే 14:**
మారుమూల గ్రామీణ విద్యార్థి ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ వైడు తన సత్తాను చాటుకున్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి స్టేట్ రెండవ ర్యాంకర్ గా తన ప్రతిభను చాటుకున్నారు. శిరివెళ్ల మండలం మోత్కులపల్లి గ్రామపంచాయతీలోని బి. విజయ శేఖర్ కుమారుడు బి. విష్ణువర్ధన్ చైతన్య పాఠశాల లో 10వ తరగతి పూర్తి చేసుకుని పబ్లిక్ పరీక్షలు రాసి 598 మార్కులతో తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకోవడంతో మాజీ సర్పంచ్ భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి అభినందన సభ ఏర్పాటు చేశారు. మారుమూల గ్రామీణ విద్యార్థి రాష్ట్రస్థాయిలోర్యాంకు సాధించడం పట్ల పలువురు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మోతుకులపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి శివరామిరెడ్డి తదితర ప్రముఖులు విద్యార్థి విష్ణువర్ధన్ ను ఘనంగా అభినందించారు. పట్టు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందించి ఉన్నత విద్యను ఉత్తమ మార్కులతో జైత్రయాత్ర కొనసాగిస్తూ ఉత్తమ కొలువు సాధించేవరకు ఈ పట్టుదలతో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని స్టేట్ డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తెలియజేశారు. మాజీసర్పంచ్ భూమా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామ పంచాయతీలోని విద్యార్థి స్టేట్ ర్యాంక్ సాధించడం తమకు గర్వకారణమని తోటి విద్యార్థులు విష్ణువర్ధన్ సాధించిన మార్కులను స్ఫూర్తిగా తీసుకొని, ఉత్తమ విద్య క్రమశిక్షణ గల విలువలతో అధిక మార్పులు సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, విద్యార్థిని ,విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

# వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో లక్ష్యాలను అధిగమించాలి.

**..రైతులకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలి.**

**..డ్రిప్ ఇరిగేషన్ విస్తరణతో పాటు ఉద్యాన సాగు, పండ్ల పంటలను ప్రోత్సహించాలి.**

**..జిల్లా కలెక్టర్ డాక్టర్. ఏ. సిరి.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే, 14:** వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికమించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ లో వ్యవసాయ, ఉద్యాన, ఏపీఎంఐపీ శాఖ అధికారులతో సంబధిత అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూడ ఏపీ ఎఫ్ఆర్‌లో రైతుల నమోదును మరింత పెంచాలని సూచించారు. రైతులు పూర్తి స్థాయిలో నమోదు చేసుకుంటే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పారదర్శకంగా మరియు సులభంగా అందుతాయని తెలిపారు. అలాగే ఏపీఎంఎస్ రైతు ఐడీల నమోదు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. రైతులు ఏపీఎంఎస్ ఐడి క్రియేట్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ నుంచి అందించే వివిధ పథకాలు, సబ్సిడీలు, సేవలు సులభంగా పొందగలరని తెలిపారు. జిల్లాలో ఇంకా పెండింగ్‌లో ఉన్న రైతులందరికీ త్వరితగతిన ఐడీలు నమోదు చేసుకునే విధంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీఎంఐపీ పథకము అమలు పై సమీక్ష నిర్వహిస్తూడ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 6,400 హెక్టార్ల లక్ష్యం ఉన్నప్పటికీ, దానిని అధిగమించి కనీసం 10 వేల హెక్టార్ల వరకు డ్రిప్ ఇరిగేషన్ విస్తరించేలా కృషి చేయాలని సూచించారు. సూక్ష్మ సాగునీటి విధానాల ద్వారా నీటి వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు రైతులకు దిగుబడులు కూడా మెరుగుపడతాయని తెలిపారు. జిల్లాలో ఉద్యాన సాగును మరింత ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా రెండు లేదా మూడు రకాల పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా పండ్ల తోటల సాగును పెంచేందుకు ఉద్యాన శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎం ఐ డి హెచ్ పథకం కింద కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, రిటైల్ మార్కెట్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు. రైతులు పండించిన ఉత్పత్తులకు నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపడితే వారికి మంచి ధరలు లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల అభివృద్ధికి అధికారులు క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశానికి జెడి అగ్రికల్చర్ వరలక్ష్మి , ఏడి హార్టికల్చర్ రాజా కృష్ణారెడ్డి, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్, సిపిఓ భారతి పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాను అత్యాచార రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి.

**..రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా సమ సమాజ నిర్మాణం జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. -..ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 14:** కర్నూలు జిల్లాను అత్యాచార రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా సమ సమాజ నిర్మాణం జరగాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ తెలిపారు.
గురువారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో జిల్లా, నియోజకవర్గ, మండల అధికారులతో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కి సంబంధించి మొత్తం 113 ఫిర్యాదులు నమోదయ్యాయన్నారు. వాటిలో కేవలం 11 కేసులకు మాత్రమే ఇప్పటి వరకు ఏటీఆర్ అందినట్లు తెలిపారు. పరిష్కార రేటు 1% కంటే తక్కువగా ఉందన్నారు. దాదాపు 102 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చైర్మన్ పేర్కొన్నారు. జిల్లాలో అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో దళితులు స్వేచ్ఛగా బతికేలా భరోసా కల్పించాల్సిన బాధ్యత పోలీస్ డిపార్ట్‌మెంట్‌పై ఉందని చైర్మన్ స్పష్టం చేశారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు తప్పుడు కేసులుగా చిత్రీకరించకుండా, సాక్ష్యాధారాలు (దెబ్బలు, ఆస్తుల నష్టం, ఫోటోలు) ఉన్నప్పుడు ఖచ్చితంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చైర్మన్ ఆదేశించారు. విధుల్లో వైఫల్యం చెందిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ తరపున సిఫార్సు చేస్తామని చైర్మన్ హెచ్చరించారు. సంస్కరణల ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, దళితులపై ప్రతాపం చూపడం సరికాదని చైర్మన్ పేర్కొన్నారు. కేవలం భౌతిక మార్పులు సరిపోవని, ప్రజల్లో చైతన్యం రావాలని మరియు సివిల్ రైట్స్ (పౌర హక్కుల) సమావేశాలు నిర్వహించాలని చైర్మన్ సూచించారు. సమస్యలను విన్నవించేటప్పుడు 'ప్రాతినిధ్యం' వహించాలని, అవసరమైనప్పుడు 'పోరాటం' చేయాలని, రెండింటికీ తేడా తెలిసి ఉండాలని స్పష్టం చేశారు. "రేపటి పనిని ఈరోజే చేయాలి, ఈరోజుటి పనిని ఇప్పుడే చేయాలి" అనే భావన అధికారుల్లో ఉన్నప్పుడే పేద ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చైర్మన్ పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్నవారి పట్ల కేవలం సానుభూతితో కాకుండా, వారి స్థానంలో మనల్ని ఉంచుకుని ఆలోచించినప్పుడే నిజమైన మార్పు వస్తుందన్నారు.
10 వ తరగతి పబ్లిక్ పరీక్షలలో కర్నూలు జిల్లా 71.08 శాతం వచ్చిందని, వచ్చే ఏడాదికి ఈ శాతం పెరగాలని చైర్మన్ విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ ల్లో పిల్లలను చేర్చుకున్నప్పటికీ,డబ్బులు తీసుకుంటున్నారని, అలాంటి కేసులను మీరు రిజిస్టర్ చేసి, అవసరమైతే స్కూల్ గుర్తింపు రద్దు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్సీ లకు సంబంధించి ఇరిగేషన్ కనెక్షన్‌లు ఎన్ని ఉన్నాయి? అగ్రికల్చరల్ సర్వీస్ (వ్యవసాయ సేవలు) కనెక్షన్ లు ఎన్ని ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు.
బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి వారి బాధను చెప్పుకునే సందర్భంలో ఓపికగా వినాలన్నారు. బాధితుడిని కూర్చోబెట్టి, మర్యాదగా మాట్లాడాలన్నారు. ప్రైవేట్ కేసు వేసుకోమని చెప్పకూడదని, న్యాయపరంగా వాళ్లకి ఎంక్వయిరీ చేసి, వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని, నమ్మకాన్ని కలిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.
సివిల్ రైట్స్ డే లు నిర్వహించాలని, ఎస్సీ,ఎస్టీ గ్రీవెన్స్ డే నిర్వహించాలని చైర్మన్ కలెక్టర్ కు సూచించారు. అట్రాసిటీ బాధితులకు పెన్షన్ ఏ నెల కానెల మంజూరు అయ్యేలా సీఎం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.
జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ కేసులకు సంబంధించి 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్' ను 15 రోజుల్లోగా సమర్పిస్తామన్నారు. భూ సమస్యలు, అసైన్డ్ భూముల పంపిణీ, పెన్షన్లు మరియు హౌస్ సైట్ పట్టాల అంశాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే సగం కేసుల్లో ఉద్యోగాలు మరియు అసైన్డ్ భూములు ఇవ్వగలిగామని, కానీ హౌస్ సైట్ పట్టాల విషయంలో పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.
ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ బాధితులకు అందాల్సిన పెన్షన్ల కోసం దాదాపు 40 నుండి 50 లక్షల రూపాయల నిధులు అవసరమని కలెక్టర్ చైర్మన్ దృష్టికి తీసుకొని వెళ్ళారు. గతంలో ఉన్నట్లుగా, ట్రెజరీ నుండి డీడీ (సోషల్ వెల్ఫేర్) నేరుగా నిధులు డ్రా చేసుకునే వెసులుబాటు కల్పిస్తే బాధితులకు త్వరగా పెన్షన్లు అందుతాయన్నారు. (ప్రజా గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్) కోసం జిల్లా ఉపాధి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించి, ఒక రిజిస్టర్ ద్వారా ఫిర్యాదులన్నింటినీ పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.
జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్ తరపు నుంచి తాము రిజిస్టర్ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో యాక్ట్ ప్రకారం 60 రోజుల్లో ఇన్వెస్టిగేషన్ కంప్లీట్ చేస్తున్నామన్నారు. అన్ని కేసుల్లోనూ ఇన్వెస్టిగేషన్ కంప్లీట్ చేసి గడువు లోపు ఛార్జ్ షీట్ వేయడం జరుగుతుందన్నారు. కొన్ని కంప్లైంట్స్ మీ ద్వారా మా దృష్టికి తీసుకురావడం జరిగిందని, వాటిని డీటెయిల్డ్ ఎంక్వైరీ చేసి వచ్చే ఒక వారంలో చేసి కమిషన్ కు రిప్లై కూడా పంపడం జరుగుతుందన్నారు. ఎవరు స్టేషన్ కి వచ్చినా వాళ్ళకి 100% న్యాయం చేస్తామన్నారు. వాళ్ళు ఇచ్చిన కంప్లైంట్స్ ని ఎవిడెన్స్ బేస్డ్ ఇన్వెస్టిగేషన్ కంప్లీట్ చేసి అందరికీ న్యాయం జరిగేలాగా చూసుకుంటామన్నారు. స్టేషన్ కి వచ్చిన వాళ్ళ ని కూర్చోపెట్టి వాళ్ళ కంప్లైంట్ ఏముందో అది తీసుకొని లా ప్రకారం ఏమి చేయాలో 100% చేస్తామన్నారు.
సమావేశంలో ఎస్సీ కమిషన్ సెక్రెటరీ చిన్న రాముడు, అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా ఎస్సీ సంక్షేమ & సాధికారత అధికారి తులసి దేవి, కర్నూలు ఇంచార్జి ఆర్డీఓ అనురాధ, పత్తికొండ ఇంచార్జి ఆర్డీఓ మధుసూదన్ రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డి ఈ ఓ సుధాకర్, ఎస్సీ కమిషన్ సభ్యులు బిక్షం మేకల, పాకనాటి గౌతమ్ రాజ్, రామాంజినమ్మ, డి వి ఎం సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి కార్పొరేట్ సహకారం అభినందనీయం.

**..సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో నూతన మరుగుదొడ్ల సముదాయం ప్రారంభం.**

**విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యం. -.జిల్లా కలెక్టర్ రాజకుమారి.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 14:**
ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ కళాశాల బాలుర హాస్టల్ -1 మరియు 2లకు నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల కాంప్లెక్స్‌ను ఆమె ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత మరియు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన పారిశుద్ధ్య వాతావరణం అందించాలనే లక్ష్యంతో ఈ సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ది రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్, కొలిమిగుండ్ల యూనిట్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) కార్యక్రమంలో భాగంగా రూ.14.53 లక్షల వ్యయంతో ఈ మరుగుదొడ్ల సముదాయాన్ని నిర్మించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నిర్మాణం ద్వారా హాస్టల్ విద్యార్థులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన మరియు నాణ్యమైన పారిశుద్ధ్య వసతులు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి దోహదపడే ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ సంస్థలు కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.
రామ్‌కో సిమెంట్స్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం తదితర రంగాల్లో సంస్థ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామ్‌కో సిమెంట్స్ కొలిమిగుండ్ల యూనిట్ హెడ్ మీనాక్షి సుందరం, ప్రెసిడెంట్ (అడ్మినిస్ట్రేషన్) ఎస్. రామరాజ్, జనరల్ మేనేజర్ ప్రభాకర్, ఏజీఎం శోభన్ కుమార్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ మేనేజర్ శ్రీనాగరాజు, జిల్లా ఎస్సీ సంక్షేమ మరియు సాధికారత అధికారి చింతామణి, కళాశాల వసతిగృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు మరియు రామ్‌కో సిమెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మనసున్న మారాజు మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్
# 76 వ పుట్టినరోజు వేడుకలు.

**-రాజకీయ త్యాగాలకు ప్రతిరూపం ఫరూక్. -పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ మారని ఒకే ఒక్కడు.**
**-ప్రజల ఆశీర్వాదాలతో నాలుగు సార్లు మంత్రి పదవులు. -వయసు లెక్కచేయకుండా నంద్యాల అభివృద్ధికి పాటుపడుతున్న నాయకుడు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 14:**
రాజకీయాలంటేనే కుళ్ళు,కుతంత్రాలు,ఎదుటి వ్యక్తులను అణగదొక్కి పదవులు పొందే నాయకులను చూస్తున్నాము.పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకొని గెలుపు,ఓటములు దైవానుగ్రహంగా స్వీకరిస్తూ తమదైన శైలిలో రాజకీయాల్లో రాణిస్తూ సెహబాష్ అనిపించుకున్నారు.ప్రజల ఆశీర్వాద బలంతో నాలుగు సార్లు ఉన్నతమైన మంత్రి పదవులు పొందిన గర్వం లేకుండా సాధారణ వ్యక్తిలా అందరిని దగ్గరకు పంచుకుంటూ పేద,ధనిక అనే తారతమ్యం లేకుండా ఆయన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ 76 వ పుట్టిన రోజు జరుపుకుంటున్న న్యాయ,మైనార్టీ శాఖామాత్యులు ఎన్.ఎం.డి.ఫరూక్ కు అభినందనలు తెలుపుతున్నారు.రాజకీయాల్లో మూడు సార్లు మంత్రి పదవులు పొందినా అధిష్టానం క్లిష్ట పరిస్థితుల్లో నంద్యాల సీటు ను మరొకరికి కేటాయించినా అధిష్టానం నిర్ణయానికి ఏకంగా నాలుగు సార్లు టికెట్టు త్యాగం చేసిన రాజకీయ మహనీయుడు అని చెప్పుకుంటున్నారు.సినీ నటుడు నందమూరి తారక రామారావు వీరాభిమాని ఫరూక్.నందమూరి తారకరామారావు పేదల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించారు.రాజకీయాల్లో చురుకుగా, తానంటే అభిమానం ఉండడంతో ఎవరు ఊహించని విధంగా ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన తర్వాత ఫరూక్ కు పిలుపు వచ్చింది.నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని చెప్పడంతో రాష్ట్రంలో అప్పట్లో సంచలనంగా మారింది.మొదటిసారి ఎమ్మెల్యే గా గెలుపొందారు.ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో నారా చంద్ర బాబు నాయుడు తెలుగుదేశం పార్టీ పగ్గాలు తీసుకున్నారు.తెలుగుదేశం పార్టీకి వీరాభిమాని కావడంతో బాబు హయంలో వరుసగా మూడు సార్లు తెలుగుదేశం పార్టీ తరుపున నంద్యాల నుంచి పోటీ చేసి విజయం సాధించడంతో మూడు సార్లు ఉన్నతమైన మంత్రి పదవులు పొందారు.రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రలు చేపట్టడంతో కాంగ్రెస్ పార్టీ పై ప్రజలు మక్కువ చూపారు.2004 లో కాంగ్రెస్ పార్టీ తరుపున శిల్పా మోహన్ రెడ్డి , టీడీపీ తరుపున ఫరూక్ ఎన్నికల్లో నిలబడ్డారు.ఆ ఎన్నికల్లో శిల్పా మోహనరెడ్డి విజయం సాధించారు.2009 ఎన్నికల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఎన్.హెచ్.భాస్కర్ రెడ్డి కి తెలుగుదేశం




పార్టీ తరుపున పోటీ చేస్తున్నారని అధిష్టానం ఫరూక్ కు చెప్పడంతో పార్టీ ఆదేశాలు శిరసా వహించారు.ఆ ఎన్నికల్లో సైతం శిల్పా మోహన్ రెడ్డి రెండవసారి విజయం సాధించి మంత్రి పదవి పొందారు.ముఖ్య మంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు.ఆ తర్వాత ఆయన కుమారుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు.ఆ సమయంలో ప్రజా రాజ్యం పార్టీలో ఉన్న భూమా నాగిరెడ్డి అనూహ్యంగా 2014 ఎన్నికల ముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు.కాంగ్రెస్ పార్టీలో ఉన్న శిల్పా మోహన్ రెడ్డి 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు.ఆ సమయంలో సైతం అధిష్టానం శిల్పా కు టికెట్ ఇవ్వడంతో ఆ ఎన్నికల్లో సైతం పార్టీ ఆదేశాలను పాటించారు.రాజకీయంలో మరో విషాదం నెలకొంది.వైసిపి పార్టీ తరుపున నంద్యాల ఎమ్మెల్యే గా గెలుపొందిన భూమా నాగిరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు.అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు తో భూమా నాగిరెడ్డి మృతి చెందడంతో ఉపఎన్నికలు జరిగాయి.ఉపఎన్నికల్లో శిల్పా మోహన్ రెడ్డి తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఉపఎన్నికల్లో వైసిపి తరుపున శిల్పా,రాజకీయాల్లో భూమా వారసుడుగా వచ్చిన భూమా బ్రహ్మానందరెడ్డి టీడీపీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు.రెండుసార్లు ఓటమి పాలుకావడంతో శిల్పా మోహన్ రెడ్డి రాజకీయాలకు దూరం అయ్యారు.2019 ఎన్నికల్లో వైసిపి పార్టీ తరుపున శిల్పా మోహన్ రెడ్డి కుమారుడు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి,టీడీపీ తరుపున భూమా బ్రహ్మానందరెడ్డి నిలబడ్డారు.వైఎస్ జగన్ ప్రభంజనం లో ఉద్దండులు సైతం ఓడిపోయారు.నంద్యాల ఎమ్మెల్యే గా శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి గెలుపొందారు.వైసిపి పార్టీ అధికారంలో ఉన్న అయిదు ఏళ్లలో ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారు.ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల ముందు తెలుగుదేశం,జన సేన,బిజెపి కూటమిలా ఏర్పడడం తో నంద్యాల అభ్యర్థి భూమానా,ఫరూక్ నా అనే సందిగ్ధం నెలకొంది.చివరకు అందరి ఊహల ను పటాపంచలు చేస్తూ అధిష్టానం ఫరూక్ కు మొగ్గు చూపింది.ఆ ఎన్నికల్లో ఎన్నో ఆరోపణలు చేసినా మంచి వేసవిలో సైతం యువకునిలా ఎండలు లెక్కచేయకుండా పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో చురుకుగా తిరుగుతూ ప్రచారాన్ని సాగించారు.ఆయన గెలుపుకు చిన్నా పెద్ద అనే తారతమ్యం లేకుండా కార్యకర్తలు సైనికుల్లా పని చేసి ఆయన గెలుపుకు సహకరించారు.ప్రజలు పెట్టుకున్న ఆశలను వమ్ము చేస్తూ గెలుపొందిన ఆయనకు మరో సారి మంత్రిపదవి లభించింది.ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారు.ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకొని దేవాలయాలకు కోట్ల రూపాయల నిధులు వచ్చేందుకు సహకరిస్తున్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న ఎందరో నీరు పేదలకు వైద్య ఖర్చులు వచ్చే విధంగా ముఖ్య మంత్రి సహాయ నిధి కింద గత రెండేళ్లలో కోట్లాది రూపాయలు బాధితులకు వచ్చే విధంగా చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మంత్రిగా రాష్ట్రంలో తిరుగుతున్న ప్రజలకు,కార్యకర్తలు ఇబ్బందులు పడకుండా కుమారులు ఫిరోజ్,ఫయాజ్ లు తండ్రి బాటనే నడుస్తూ వివాదాలకు దూరంగా ఉంటూ నంద్యాల అభివృద్ధిలో చెరగని ముద్ర వేస్తున్నారు.40 ఏళ్లుగా పార్టీని నమ్ముకొని నలుగుసారు అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి సీటు త్యాగం చేసిన ఆయన నాలుగు సార్లు మంత్రి పదవి పొంది సామాన్య ప్రజలకు అండగా ఉంటూ 76 వ పుట్టినరోజు జరుపుకుంటున్న ఫరూక్ గారికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నారు

## నంద్యాల అభివృద్ధికి అనుక్షణం కృషి చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 14:**
నంద్యాల పట్టణ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ప్రతిరోజూ ఉదయం నుంచే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.మొదట రైతునగర్ ప్రాంతంలో పర్యటించిన కమిషనర్ స్థానికులను కలిసి తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ తదితర సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న మున్సిపల్ సేవలపై అభిప్రాయాలు అడిగి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
అనంతరం అన్న క్యాంటీన్ ను తనిఖీ చేసి అక్కడ భోజన నాణ్యత, పరిశుభ్రత, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. క్యాంటీన్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సిబ్బందికి సూచించారు.
సరస్వతి నగర్ లో డ్రైనేజీ సమస్యలను స్థానిక ప్రజల నుంచి స్వయంగా తెలుసుకున్న కమిషనర్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని స్పష్టం చేశారు.
గుడిపాడు గడ్డ ప్రాంతంలో కొనసాగుతున్న సెన్సెస్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.
తదుపరి బొమ్మల సత్రం సచివాలయాన్ని తనిఖీ చేసిన కమిషనర్ ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.
అలాగే పీవీ నగర్ వద్ద ఉన్న కంపోస్టు యార్డ్ ను పరిశీలించిన కమిషనర్ ఘన వ్యర్థాల నిర్వహణ ప్రక్రియను తనిఖీ చేశారు. చెత్త సేకరణ, వ్యర్థాలవేరు చేసే విధానం, కంపోస్టు తయారీ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని స్పష్టం చేశారు.కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా పనిచేయాలి.

**..పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం సహించం.**
**..జిల్లాలో 100 శాతం ఇన్‌లైన్ క్లోరినేషన్ అమలు చేయాలి.**
**..గ్రామాల్లో నీటి వనరుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి.**
**..“స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర” కార్యక్రమంలో అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలి.**
**..పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలి.**
**..స్వచ్ఛ రథాల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ వేగవంతం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 14:**
వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మండల, గ్రామ స్థాయి స్పెషల్ అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ప్రజాభిప్రాయ సర్వేలు, మరుగుదొడ్ల నిర్మాణం మరియు ప్రభుత్వ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ వేసవిలో 44-45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో నీటి వనరులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, బోర్‌వెల్స్, పైప్‌లైన్ల పరిస్థితిని స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. క్లోరినేషన్ ప్రక్రియను అధికారులు పూర్తిగా అవగాహన చేసుకోవాలని, జిల్లాలో 100 శాతం ఇన్‌లైన్ క్లోరినేషన్ అమలు కావాలని కలెక్టర్ ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలు, మురుగునీరు కలిసే పరిస్థితులు ఏర్పడి డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో నీటి ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ నిర్వహించిన తేదీలను స్పష్టంగా బోర్డులపై ప్రదర్శించాలని, సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని తెలిపారు. నీటి వనరుల పరిసరాల్లో చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు ప్రత్యామ్నాయ నీటి వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పారిశుధ్య నిర్వహణలో కేవలం యాప్‌లలో ఫోటోలు అప్‌లోడ్ చేయడం కాకుండా క్షేత్రస్థాయిలో స్పష్టమైన మార్పు కనిపించేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మూడవ శనివారం నిర్వహించే “సాసా - స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర” కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. రాష్ట్ర ర్యాంకింగ్స్‌లో లిక్విడ్ మరియు ఫీకల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశాల్లో జిల్లా వెనుకబడిందని పేర్కొంటూ పరిస్థితిని మెరుగుపరచాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించేందుకు “స్వచ్ఛ పదం” కార్యక్రమాన్ని ప్రతి



బుధవారం తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా యాగంటి, మహానంది, ఓంకారం, శ్రీశైలం, నందవరం, అహోబిలం, ఆత్మకూరు వంటి పర్యాటక మరియు ఆధ్యాత్మిక ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పీడీఎస్ మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లను ఇప్పుడు “స్వచ్ఛ రథాలుగా” వినియోగిస్తూ గ్రామాల్లో చెత్త సేకరణ చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రజలు ఇంటి వద్ద ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను అందిస్తే వాటికి బదులుగా అవసరమైన వస్తువులు అందించే విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. మే 18 నుండి 25 వరకు జరిగే ప్రజాభిప్రాయ సర్వేలో స్వచ్ఛ రథం గ్రామానికి వచ్చిందా, ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతుందా, వారానికి కనీసం రెండు సార్లు చెత్తను తీసుకెళ్తున్నారా వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.
పీఎం ఆవాస్ యోజన కింద జిల్లాలో దాదాపు 36 వేల ఇళ్లు పూర్తయినా, అందులో సుమారు 4,500 ఇళ్లకు మరుగుదొడ్లు లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి మండలం, గ్రామంలో అవసరమైన టాయిలెట్ల వివరాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు పంపాలని స్పెషల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మంజూరైన 561 టాయిలెట్లలో మిగిలిన 149 నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

## ఆర్ఓ ప్లాంట్ కు భూమి పూజ చేసిన టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 14:**
నంద్యాల స్థానిక 38 వార్డ్ వైయస్సార్ నగర్ నివాసితుల చిరకాల వాంఛ అయిన సురక్షిత మంచినీటి సౌకర్యం త్వరలోనే సాకారం కానుంది. ఎంపీ నిధుల సహకారంతో ఇక్కడ నిర్మించనున్న ఆర్ఓ ప్లాంట్‌కు టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ గురువారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫయాజ్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే మా ప్రధాన లక్ష్యం అన్నారు. వైయస్సార్ నగర్ ప్రజలకు ఎంపీ నిధులతో వాటర్ ప్లాంట్ కేటాయించడం జరిగిందన్నారు. ఈ ఆర్ఓ ప్లాంట్ అందుబాటులోకి రావడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందుతుందన్నారు. రాబోయే రోజుల్లో 38వ వార్డులో ఉన్న పెండింగ్ సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మన మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి, ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు నా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్లు ఈ ప్లాంట్ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు.ఈ కార్యక్రమంలో 38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గ రాముడు, మహేష్ బాబు , అధికారులు, ఆర్డబ్ల్యుసి డిఈ , కాంట్రాక్టర్ జగన్, వడ్డే నాగేంద్ర, హిమా హుస్సేన్, సౌభాగ్యవతి, మేషేక్, ప్రసాద్ రెడ్డి, రాఘవేంద్ర, గౌస్, అంకన్న, కాజా, సచివాలయ సిబ్బంది మరియు షబ్బీర్, గౌండ ఖలీల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో ఆదర్శప్రాయుడు మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**..ఒకే కారు, ఒకే గన్‌మెన్‌తో నిరాడంబర ప్రయాణం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 14:**
రాజకీయాల్లో హంగులు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ, గత 40 ఏళ్లుగా తనదైన ముద్ర వేసిన రాష్ట్ర మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ గారు మరోసారి తన నిరాడంబరతను చాటుకున్నారు. సాధారణంగా మంత్రుల కాన్వాయ్ అంటే పదుల సంఖ్యలో వాహనాలు, భారీ భద్రతా వలయం ఉంటుంది. కానీ, మంత్రి ఫరూక్ గారు వీటన్నింటికీ భిన్నంగా “పొదుపు బాట“ పట్టి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ ఆడంబరాలకు వెళ్లని ఆయన, 40 సంవత్సరాలు నుండి ఇప్పటివరకు కేవలం ఒక్క కారు మరియు ఒకే గన్‌మెన్ కే పరిమితమై తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. భారీ కాన్వాయ్‌ల వల్ల సామాన్య



ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. మంత్రి ప్రయాణిస్తున్నప్పుడు ఎక్కడా సామాన్యుల రాకపోకలకు ఆటంకం కలగకపోవడం విశేషం. భద్రత మరియు వాహనాల రద్దీని తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై పడే అదనపు భారాన్ని (భద్రతా వ్యయం) తగ్గించవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. “పదవులు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ ప్రజలకు సేవ చేసే విధానంలో మార్పు ఉండకూడదని . ఆర్భాటాల కంటే ప్రజలకు చేరువగా ఉండటమే ముఖ్యం అని మంత్రి ఎన్ఎండి ఫరూక్ నిరూపించారు. నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా, నిరాడంబర జీవిగా పేరు తెచ్చుకున్న ఫరూక్ గారి ఈ నిర్ణయం పట్ల నంద్యాల ప్రజలతో పాటు రాజకీయ విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేటి తరం రాజకీయ నాయకులకు ఆయన జీవనశైలి ఒక గొప్ప సందేశాన్ని ఇస్తోందని అన్నారు.

## ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు దశల వారి ఆందోళనలు.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 14:**
నంద్యాల పట్టణంలో నీ ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు వచ్చేంతవరకు దశల వారి ఆందోళనలను నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు తెలిపారు. పట్టణంలోని ఇంటి స్థ లాల అర్జీదారుల సమావేశం సిపిఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి పాల్గొన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు త్వరగా కాలయాపన చేయకుండా నంద్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు రెండు సెండ్ల ఇంటి స్థలం కేటాయించాలని అన్నారు. ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన అప్పటినుండి ఇప్పటికి నాలుగు సార్లు పేపర్ స్టేట్మెంట్లకే పరిమితమైనది త్వరగా పట్టణంలో అనుకూలమైన స్థలంలో ఇంటి స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు ఎందుకంటే నంద్యాల పట్టణంలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో దశలవారీగా సచి వాల యాలలో ఎమ్మార్వో కార్యాలయంలో ఇల్లు లేని నిరు పేదలతో వ్యక్తిగత అర్జీలు ఇప్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇంటి స్థలాల అర్జీదారులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 15 మే 2026

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కేంద్ర ప్రభుత్వం.!

## ..నీట్ రద్దుతో 22 లక్షల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం..?

**..రాజకీయ నాయకుల అండదండలతో ధనవంతుల పిల్లలు నీట్ క్యూస్షన్ పేపర్లను కొనుగోలు చేసి పేద ,మధ్యతరగతి విద్యార్థుల జీవితాలను నాశనం చేశారు.**

**..విద్యార్థులు నీట్ ద్వారా డాక్టర్ కావాలన్న...వారి కలలు చిన్నాభిన్నం చేసిన రాజస్థాన్ బిజెపి నేత.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 14:**
దేశవ్యాప్తంగా విద్యార్థులు నీట్ ద్వారా డాక్టరు కావాలని ఎన్నో కలలతో అహోరాత్రులు కష్టపడి చదివిన విద్యార్థుల కలలు నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థంగా మారింది విద్యార్థుల జీవితాలను వేలం వేసి అమ్మేస్తున్న మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం ఎంతమాత్రం క్షమించరానిది. విద్యార్థులు కఠోర శ్రమ త్యాగాలు ఆశలు అన్ని వృధా అయిపోయాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో కష్టపడి అప్పులు చేసి వారి పిల్లల భవిష్యత్తు కోసం కార్పొరేటు కోచింగ్ సెంటర్లలో లక్షలు వెచ్చించి కోచింగ్ ఇప్పించారు. ఈనెల మూడో తారీఖున దేశవ్యాప్తంగా 22 లక్షల పైబడి విద్యార్థులు నీట్ పరీక్ష రాయడం జరిగింది. విద్యార్థులు జూన్ మాసంలో విడుదలయ్యే నీట్ రిజల్ట్స్ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఒక బాంబు లాంటి విస్ఫోటనంలా నీట్ పేపర్ లీకేజీ వార్త రాగా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. సిబిఐ అధికారుల చేత ఇప్పటికే ఐదు మందిని అరెస్టు చేసినట్లు మరికొందరిని అరెస్టు చేయడానికి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రింట్ మీడియా ద్వారా సామాజిక మాధ్యమాల ద్వారా తెలుస్తుంది. దేశవ్యాప్తంగా నీట్ లీకేజీ పైన సెంట్రల్ బ్యూరో ఇన్వెస్టిగేషన్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్లు మనకు తెలుస్తుంది. అదేవిధంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో సోదాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కేరళ రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదువుతున్న రాజస్థాన్ లోని షికారుకు చెందిన ఓ విద్యార్థి నుంచి నీట్ పేపర్ లీకేజ్ ప్రక్రియ మొదలైనట్లు పోలీస్ అధికారులు గుర్తించారు. దేశవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్షను పగడ్బందీగా (ఎన్.టి.ఏ) నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించడం జరుగుతుంది. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన గత 11 ఏళ్లలో 89 సార్లు లీకేజ్ అయినట్లు మనకు వాస్తవాలు తెలుస్తున్నాయి. 48 గంటల్లో 122 ప్రశ్నలు లీక్ కావడం చాలా దుర్మార్గమైన చర్యగా భావించాలి.

### నీట్ పరీక్షకు ప్రిపేర్ అయినా పేద, మధ్యతరగతి విద్యార్థుల కన్నీటి కడుపు మంట ఎలా ఉంటుంది?

దేశవ్యాప్తంగా 2026 ఈ నెల 3 వ తారీఖున నీట్ పరీక్ష పోలీసు బలగాలను సెంటర్ల వద్ద ఏర్పాటు చేసి పగడ్బందీగా జరిపారు. అయితే నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా రద్దు చేశారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తీవ్రమైన మానసిక బాధ, ఆవేదన, ఆర్థిక మరియు సామాజిక వేదనను దుఃఖాన్ని కన్నీటిని మిగిల్చింది. పేపర్ లీక్ ఆరోపణలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాల వల్ల జరిగిన ఈ రద్దు, దేశవ్యాప్త విద్యార్థుల కడుపు మంటను రగిల్చేలా ఉన్నది. పేద విద్యార్థులలో దుఃఖము వారి యొక్క బాధ వర్ణనాతీతం. ఏళ్ల తరబడి కష్టపడి చదివి నీటి పరీక్షకు హాజరైన విద్యార్థుల జీవితాలలో బూడిదలో పోసిన పన్నీరులా ఉన్నది. పేద విద్యార్థులు ఎంతో కష్టపడి సదుపాయాలు లేకపోయినా పగలు రాత్రి తేడా లేకుండా కష్టపడిన విద్యార్థులు కొందరైతే, మరికొందరు విద్యార్థులు వివిధ




కార్పొరేటు కోచింగ్ సెంటర్లలో లక్షలు వెచ్చించి రెండు మూడు సంవత్సరాలు డ్రాప్ తీసుకొని ప్రిపేర్ అయిన వారు ఉన్నారు. లక్షల రూపాయలు పోగొట్టుకున్న వారు దేశవ్యాప్తంగా అనేకమంది ఉన్నారు. కొన్నిసార్లు 1,2,3, సంవత్సరాలు డ్రాప్ తీసుకొని ప్రిపేర్ అవుతారు వారి కష్టం ఒక్క నీట్ పేపర్ లీకేజీ నిర్ణయంతో వారి జీవితాలు వృధా కావడంతో తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. ఆర్థిక భారంతో బాధపడిన విద్యార్థులు,కోచింగ్ సెంటర్లు, పుస్తకాలు మరియు పరీక్ష కేంద్రాలకు ప్రయాణ ఖర్చులు పేద కుటుంబాలకు మోయలేని పెను భారం. మళ్లీ నీట్ పరీక్ష రాయాల్సి రావడం, మళ్లీ అదే ఖర్చులు కోచింగ్ సెంటర్లకు ఫీజులు చెల్లించాల్సి రావడంతో వారి యొక్క తల్లిదండ్రులు అప్పుల పాలు అవుతున్నారు.




ఈ ఆర్థిక భారం ఎవరు మోయగలరు? వారి బాధలు ఎవరు తీర్చగలరు? వారి కన్నీటిని తుడిచే వారు ఎవరు? వారి పిల్లల భవిష్యత్తు కోసం చేసిన అప్పులు తీర్చే వారు ఎవరు? కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు నాశనమైనది. ముఖ్యముగా ఈ పరిస్థితులు కేవలం విద్యార్థులనే కాకుండా వారి తల్లిదండ్రుల ఆశలను కష్టార్జితాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి. ఎంతో కష్టపడి చదివిన ప్రతిభావంతులకు తీరని అన్యాయము జరిగిందనే భావన దేశవ్యాప్తంగా వ్యక్తం అవుతుంది.

### నీట్ పరీక్షకు నిజాయితీగా కష్టపడే విద్యార్థులకు న్యాయం ఎలా జరుగుతుంది?

విద్యార్థులకు మళ్లీ కోచింగ్ సెంటర్లకు చేరుకొని అక్కడ చదువుకోడానికి వెళ్లి మరల ఫిజిక్స్,కెమిస్ట్రీ, బయాలజీ, ఎన్సీఈఆర్టీ పుస్తకాలను చదువుకోవలసి వస్తుంది. ఇటువంటి సంఘటనలు వ్యవస్థపై, చదువుపై తమ సొంత ఆర్థిక సామర్థ్యం పై నమ్మకాన్ని పోగొడతాయి. ఇలాంటి బాధలు ఎవరు తీర్చగలరు? నీట్ 2026 పేపరు లీకేజ్.ఆరోపణల కారణంగా రద్దు అయ్యింది. సిబిఐ రంగంలోకి దిగి విచారణ చేపట్టింది అయినా ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రయోజనం ఏంటి? నిజాయితీగా అహోరాత్రులు కష్టపడే విద్యార్థులకు న్యాయం జరగాలని అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. వారిలో మానసిక ఆందోళన మరియు డిప్రెషన్ తో ఉన్నారు. ఇప్పటికే పరీక్ష ఒత్తిడితో సతమతమవుతున్న విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారింది. పరీక్ష రద్దు తో ఇలాంటి వార్తతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. మళ్లీ అదే పరీక్షను అదే స్థాయిలో రాయగలమా? ఆశించిన మార్కులు రాగలవా? ఎంబిబిఎస్ సీటు వస్తుంది అనే కలలుగన్న విద్యార్థులు మరల సాధించగలమా? ఇలాంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వారిలో భయం ఆందోళన వారిని మానసికంగా కృంగదీస్తుంది. ఈ పాపం ఎవరిది? విద్యార్థులు నిరుత్సాహంతో వారి భవిష్యత్తుపై వారికి భయం పెరుగుతుంది. నీట్ ద్వారా డాక్టర్ కావాలనే కళ ఒక్కసారిగా పెను దుఃఖంతో చెదిరిపోవడంతో చదువుపై ఆసక్తి కోల్పోవడం భవిష్యత్తు మరింత ప్రశ్నార్థకంగా మారడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అన్యాయం జరిగిందనే భావన దుఃఖం ఒకవైపు మరోవైపు ధనవంతుల పిల్లలు పేపర్లను కొనుగోలు చేసి పేద విద్యార్థుల సీట్లను దొంగిలిస్తున్నారని ఆరోపణలు వ్యవస్థ పై నమ్మకాన్ని పూర్తిగా దెబ్బతీశాయి. ఏళ్ల తరబడి సాగించిన త్యాగాలు, నిద్రలేని రాత్రులు తల్లిదండ్రుల కష్టార్జితం వారి కన్నీరు అంతా ఒకసారి ఆవిరైపోతుంటే ఆ పేద మధ్యతరగతి విద్యార్థుల గుండె కడుపు మంటలతో రగిలిపోతుంది ఈ సత్య పరిస్థితులను అర్థం చేసుకునే వారు ఎవరు ? వారి దుఃఖాలకు కేంద్ర ప్రభుత్వం కారణం కాదా? ఇలాగా పేద మధ్యతరగతి విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారని విమర్శలు దేశవ్యాప్తంగా వినిపిస్తున్నాయి.

### కష్టపడి చదివిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అక్రమ మార్గంలో పేపర్లు కొనుగోలు చేసిన వారికీ మధ్య తేడా లేకుండా పోతుందని ఆవేదన

దేశవ్యాప్తంగా కష్టపడి చదువుకునే పేద మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ఎలా ఉంటుందో? సమాజానికి అర్థమవుతుంది. వారిలో మానసిక ఆందోళన మళ్లీ అదే ఒత్తిడితో అదే సబ్జెక్టులను 45 రోజుల్లో మళ్లీ పరీక్ష రాయాల్సి వస్తుందని భయం ఆందోళన వారిని మానసికంగా కృంగదీస్తుంది. నిద్రలేమి, భయము, మానసిక ఒత్తిడి భవిష్యత్తుపై అభద్రతాభావం వారిలో పెరుగుతుంది.ప్రతిభావంతులైన పేద మధ్యతరగతి విద్యార్థులు కష్టపడి చదివిన వారికి అక్రమ మార్గాలలో ధనవంతుల పిల్లలు పేపర్ కొనుక్కున్న వారికి మధ్య తేడా లేకుండా పోతుందని వారు ఆవేదన చెందుతున్నారు. అక్రమాలు జరిగినప్పుడు నిజాయితీగా కష్టపడి చదివిన విద్యార్థులకు, కోచింగ్ లు తీసుకోలేని పేద మధ్యతరగతి విద్యార్థులకు అన్యాయమే జరుగుతుంది. వారి సమయం వృధా అయిపోయింది, దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్ష రద్దు కావడం వల్ల ఆ విద్యార్థుల భవిష్యత్తు కెరీర్ ఒక్క సంవత్సరము వెనక్కి వెళుతుంది. వారు ఎంతో ప్రణాళిక బద్ధంగా వారి కెరీర్ భవిష్యత్తు కోసం ప్రణాళికలను చిన్నాభిన్నం చేసింది. కష్టపడి చదువుకునే విద్యార్థుల భవిష్యత్తు ఎలా ఉంటుందో ? మేధావులకు, ప్రజాస్వామ్య వాదులకు, విశ్వవిద్యాలయంలోని ఆచార్యులకు, పరిశోధకులకు,విద్యార్థి సంఘాల నాయకులకు తెలుస్తుంది. మళ్లీ పరీక్ష రాయాలంటే అదే తీవ్రతతో నిబద్ధతతో చదవడం మానసికంగా చాలా కష్టమైన పని. పేద విద్యార్థులకు మళ్లీ కోచింగ్ సెంటర్ కి వెళ్లి ఫీజు కట్టే శక్తి లేని పేద మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో వారిలో నిరాశను రేకెత్తిస్తుంది. విద్యార్థులు రాత్రింబవళ్లు శ్రమించి కుటుంబ ఆర్థిక పరిస్థితులను ఎదిరించి ఎంబిబిఎస్ సీటు కోసం కలలు కన్నె విద్యార్థులపై ఈ ప్రభావం మాటలకు అందని విధంగా దుఃఖం ఉంటుంది. వారిలో తీవ్రమైన నిరాశ ఆవేదన నెలల తరబడి కొన్నిసార్లు ఏళ్ల తరబడి కుటుంబానికి, రక్తసంబంధీకులకు, బంధువులకు దూరంగా ఉంటూ కోచింగ్ సెంటర్లలో కష్టపడి చదివిన విద్యార్థులు పరీక్ష రాశాక అమ్మయ్య అనుకునే లోపే రద్దు వార్త వింటే వారి ఆశలు అడియాసలయ్యాయి. వారి పేదరికంలో ఆర్థిక భారం పేద మధ్యతరగతి తల్లిదండ్రులు తమ ఉన్న పొలాలు, ఇళ్లు, బంగారు ఆభరణాలను అమ్మి లేదా అధిక వడ్డీలకు అప్పులు చేసి కోచింగ్ ఫీజులు, హాస్టల్ ఖర్చులు భరిస్తారు. పరీక్ష రద్దు కావడం అంటే కుటుంబాలు మొత్తం ఆర్థికంగా మళ్లీ మొదటికి రావడంతో తల్లడిల్లి పోతున్న కుటుంబాలను ఓదార్చేది ఎవరు? ఇలాంటి సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టి పేద మధ్యతరగతి విద్యార్థుల జీవితాలను నాశనం చేయకుండా కాపాడాలని కోరుకుందాం



డా.జి.బాలస్వామి.,
న్యాయవాది మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్టు